## 'పది' లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

నస్పూర్, జనవరి 30 : పదవ తరగతి వార్షిక పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎస్సీ కళాశాల, బాలికల వసతి గృహంలో నిర్వహించిన ప్రేరణ అవగాహన తరగతులకు డీఈవో యాదయ్య, ఇన్‌చార్జి ఎస్‌సీడీఈ రవీందర్‌తో కలిసి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రేరణ అవగాహన తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వెనకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమాధికారులున్నారు.

## ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలి

నస్పూర్, జనవరి 30 : ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతిలో వంద శాతం ఫలితాలు సాధించేందుకు ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో యాదయ్య పేర్కొన్నారు. గురువారం డీఈవో కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల జనవరి 31లోపు ప్రతి పాఠశాలలో పదవ తరగతి సిలబస్ పూర్తి కావాలని, ఫిబ్రవరి 1 నుంచి రివిజన్ క్లాసులు నిర్వహించాలని సూచించారు. ఫిబ్రవరి 17 నుంచి పదవ తరగతి విద్యార్థులకు గ్రాండ్ టెస్ట్ నిర్వహిస్తున్నామని, తర్వాత ప్రీ ఫైనల్ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏసీజీఈ దామోదర్‌రావు, డీసీఈబీ కార్యదర్శి కొండు బీంరావు, సెక్టోరల్ అధికారి చౌదరి, కుమారస్వామి, ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

కోటపల్లి, జనవరి 30 : కోటపల్లి మండలంలోని బ్రాహ్మణపల్లి శివారులో బంజేరుకుంటను ఆక్రమించుకోవాలని చూస్తున్న వ్యక్తుల పై చర్యలు తీసుకోవాలని కోటపల్లి మండల కోలవార్ సేవా సంఘం అధ్యక్షుడు ఆత్రం మధూకర్, సీనియర్ నాయకులు పసుల రాజయ్య, శేగం చంద్రయ్య, ఇగం లక్ష్మణ్ తహసీల్దార్ మహేంద్రనాథ్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ విషయమై విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు.

## లింగుస్వామి జాతరలో ఎమ్మెల్యే పూజలు

కాసిపేట, జనవరి 30 : కాసిపేట మండలంలోని కుర్రేఘడ్ శివారులోని ఆదివాసీల ఆరాధ్య దైవం పాహుండి కుపర్ లింగు స్వామి జాతరలో పాల్గొని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, తెలంగాణ రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ చైర్మన్ కోట్నాక తిరుపతి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారికి ఆలయ అభివృద్ధిపై ఆలయ కమిటీ సభ్యులు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో గురు స్వామి కుర్సెంగ భూదేశవ్, దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పూర్ణచందర్, డిప్యూటీ రేంజర్ ప్రవీణ్ నాయక్, ఆదివాసీ సంఘాల నాయకులు, నాయకులు పాల్గొన్నారు.

## ఎంపీటీసీల పునర్విభజన నోటిఫికేషన్ విడుదల

హాజీపూర్, జనవరి 30 : ఎంపీటీసీల పునర్ విభజన నోటిఫికేషన్ విడుదలైనట్లు హాజీపూర్ ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు. గురువారం మండలంలోని గుడిపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనమవుతున్న వేంపల్లి, ముల్కల్ల, నంనూర్, గుడిపేట, నర్సింగాపూర్ మినహా మిగతా 12 గ్రామ పంచాయతీలు మండలంలో ఉండనున్నాయన్నారు. వీటిలో మొత్తం ఆరు ఎంపీటీసీలు ఉండగా వాటికి డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో ఉమర్ షరీఫ్, మండల అభివృద్ధి కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కొండయ్య, పంచాయతీ కార్యదర్శులు మల్లేశ్, శ్రీనివాస్ తదితరులున్నారు.

**కన్నెపల్లి మండలంలో..**

కన్నెపల్లి, జనవరి 30 : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఎంపీడీవో గంగామోహన్ మండలంలోని కొత్త ఎంపీటీసీ స్థానాలను ప్రదర్శించారు. గతంలో భీమిని, వీగాం, చిన్నగుడిపేట, పెద్దపేట ఎంపీటీసీ స్థానాలు , ఓటర్ల లిస్టు ప్రదర్శించారు. గతంలో భీమిని మండలంలో నాలుగు ఉండగా జనాభా లెక్కల ప్రకారం కొత్త ఎంపీటీసీగా కేస్లాపూర్‌ను ఎంపిక చేశారు. దీనిపై అభ్యంతరాలుంటే ఫిబ్రవరి 3న పూర్తి స్థాయి జాబితా తయారు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో బాస్కర్‌రావు, ఈసీ రాజేంద్ర పాల్గొన్నారు.

## గుండెపోటుతో హెడ్‌కానిస్టేబుల్ మృతి

చెన్నూర్ టౌన్, జనవరి 30 : చెన్నూర్ పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో గుండెపోటుతో హెడ్‌కానిస్టేబుల్ మృతి చెందాడు. చెన్నూర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న టీఎస్ఎస్పీ హెడ్‌కానిస్టేబుల్ సొలిగంటి లచ్చయ్య (55) గుండెపోటుతో స్టేషన్‌లో గురువారం హఠాత్తుగా కుప్పకూలిపోయాడు. తోటి సిబ్బంది గమనించి వెంటనే మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అప్పటికే లచ్చయ్య మృతిచెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. దండేపల్లి మండలం పాత మామిడిపల్లి గ్రామానికి చెందిన లచ్చయ్య మృతిపై పలువురు పోలీస్ సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

## అడవి పందిని హతమార్చిన ముగ్గురిపై కేసు నమోదు

వేమనపల్లి, జనవరి 30 : మండలంలోని నీల్వాయి గ్రామ శివారులో మక్క చేను చుట్టూ విద్యుత్ వైర్లు అమర్చి అడవి పందిని హతమార్చిన ఘటనలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు నీల్వాయి ఎఫ్ఆర్వో అప్పలకొండ తెలిపారు. నీల్వాయి గ్రామానికి చెందిన మంత్రి రాజన్న, నర్వెల్లి మల్లయ్య, గొర్లపల్లికి చెందిన నికాడి మల్లేశ్ విద్యుత్ వైర్లు అమర్చి అడవి పందిని హతమార్చారన్నారు. మాంసం పంచుకుంటుండగా పక్కా సమాచారంమేరకు గురువారం పట్టుకున్నామని తెలిపారు. నిందితులను అదుపులోకి తీసుకుని మాంసాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో ప్రమోద్‌కుమార్, బీట్ ఆఫీసర్ పాల్గొన్నారు.

## యువకుడి ఆత్మహత్య

మంచిర్యాల అర్బన్, జనవరి 30:మంచిర్యాల జిల్లా కేంద్రానికి చెందిన చిట్యాల తరుణ్ (21) పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు చేసుకున్నట్లు పట్టణ ఏఎస్ఐ వెంకన్న గౌడ్ తెలిపారు. గురువారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం తరుణ్ మంచిర్యాలలో మున్సిపాలిటీ కాంట్రాక్ట్ వర్కర్‌గా పని చేస్తున్నట్లు కొంత కాలంగా మద్యానికి బానిసై పనికి వెళ్లడం లేదు. తల్లి మందలించడంతో బుధవారం మధ్యాహ్నం జీవితంపై విరక్తితో పురుగుల మందు తాగాడు. తల్లికి చెప్పగా వెంటనే మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం ఎంజీఎం దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్లు పేర్కొన్నారు. తల్లి సూరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ఫ్లెక్సీల తొలగింపు


చెన్నూర్‌టౌన్ /జైపూర్, జనవరి 30: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినందున చెన్నూర్ పట్టణంతో పాటు జైపూర్ మండలంలో రాజకీయ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను మున్సిపల్, పంచాయతీ అధికారుల ఆధ్వర్యంలో తొలగిస్తున్నారు.

## మందమర్రి మున్సిపల్ కమిషనర్ బదిలీ

మందమర్రి, జనవరి 30: మందమర్రి మున్సిపల్ కమిషనర్ నిలిగొండ వెంకటేశ్వర్లును వనపర్తి జిల్లా వనపర్తి మున్సిపాలిటీకి బదిలీ చేస్తూ పురపాలక పరిపాలన శాఖ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ శ్రీదేవి ఉత్తర్వులు జారీ చేశారు. రామగుండం మున్సిపాలిటీలో అసిస్టెంట్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న తుంగపిండి రాజలింగు మందమర్రి మున్సిపాలిటీ కమిషనర్‌గా నియమితులయ్యారు. మందమర్రి కమిషనర్ వెంకటేశ్వర్లు సంవత్సరం లోపే బదిలీ కావడం చర్చనీయాంశంగా మారింది.

## కవ్వాల్‌లో రాత్రి వేళ లో వాహనాల నిలిపివేత

జన్నారం, జనవరి 30 : డివిజన్‌లో కవ్వాల్ అభయారణ్యంలోకి రాత్రి 9 నుంచి ఉదయం 6 గంటల వరకు అటవీశాఖ చెక్‌పోస్టులు ఇందన్‌పెల్లి, తపాలాపూర్, ముత్యంపేట వద్ద స్థానికేతరుల వాహనాలను నిలిపివేస్తున్నట్లు జన్నారం, ఇందన్‌పెల్లి ఎఫ్ఆర్వోలు సుష్మారావు, కారం శ్రీనివాస్ ప్రకటనలో తెలిపారు. స్థానికుల వాహనాలకు అనుమతిస్తామని, ఆధార్ కార్డు, గుర్తింపు కార్డులను తప్పని సరిగా చూపించాల్సి ఉంటుందని తెలిపారు. ఎమర్జెన్సీ, ఆర్టీసీ, అంబులెన్స్, ఇతర అత్యవసర వాహనాలకు అనుమతి ఇవ్వనున్నట్లు తెలిపారు. స్థానికులకు సెజ్ చార్జీలను మినహాయింపు ఉంటుందని తెలిపారు. వాహనాదారులందరూ నిబంధనలు పాటించి అడవులు, వన్యప్రాణులను రక్షణకు పాటుపడాలని తెలిపారు..



సిర్పూర్(యూ) : గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



కాగజ్‌నగర్ : గాంధీ విగ్రహం వద్ద ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

# మహాత్మా..హామీలు అమలయ్యేలా చూడు

- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, మాజీ ఎమ్మెల్యేలు ఎన్ దివాకర్‌రావు, డీ చిన్నయ్య
- వర్ధంతి సందర్భంగా గాంధీ విగ్రహాలకు '420' హామీలపై వినతి పత్రాలు అందించిన బీఆర్ఎస్ నాయకులు



మందమర్రిలో గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఆసిఫాబాద్ టౌన్, జనవరి 30: కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలయ్యేలా చూడాలని ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని మహాత్మా గాంధీజీ విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎలాగైనా ఎన్నికల్లో గెలవాలనే ఉద్దేశంతో గ్యారెంటీల గారడీ మాటలు మాట్లాడి ప్రజలను మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు ప్రజల పక్షాన ఉంటూ పోరాడుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విందో చైర్మన్ అలీబిన్ అహ్మద్, బీ ఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్, వెంకన్న, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ 420 హామీలకు 420 రోజులు..**

**-మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు**

మంచిర్యాలటౌన్, జనవరి 30: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలు ఇచ్చి నేటికి ప్రభుత్వం ఏర్పడి 420 రోజులు అయినా వాటిని నెరవేర్చడం లేదని, వెంటనే కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం మంచిర్యాలలోని గాంధీ పార్కులో మహాత్మాగాంధీ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు వినతిపత్రం అందించారు. గాంధీజీ వర్ధంతి సందర్భంగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దివాకర్‌రావు మాట్లాడుతూ ఓట్లు దండుకోవడానికే హామీలు ఇచ్చారని, వాటిని నెరవేర్చాలని అడిగితే దాడులు, అరెస్టులు, తప్పుడు కేసులు పెడుతున్నారని అన్నారు. డిసెంబర్ 9 తరువాత రూ.2 లక్షల రుణమాఫీ అని, రేషన్‌కార్డులు అని, రైతుభరోసా ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ నాయకులు వాటిని మరిచారని అన్నారు. ఇప్పటికే రైతు భరోసా ఎగ్గొట్టారని అన్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి కాంగ్రెస్ పార్టీ ఎన్నో అలవిగాని హామీలను ఇచ్చి తెలంగాణ ప్రజలను మోసం చేసిందని, డిక్లరేషన్ల పేరుతో, హామీల పేరుతో, గ్యారంటీల పేరుతో 420 బూటకపు హామీలను ఇచ్చిందన్నారు. వంద రోజుల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తామని చెప్పి, 420 రోజులైనా హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఎన్నికల్లో విజయం సాధించి, అధికారంలోకి వచ్చిన రోజు నుంచే హామీలపై రకరకాల సాకులతో కాలం వెళ్లదీస్తూ, కొన్ని పథకాలకు ఏవేవో కొర్రీలు పెట్టి లబ్ధిదారులను తగ్గించే ప్రక్రియ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. పైగా రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి తో పాటు కాంగ్రెస్ నేతలంతా అబద్ధాలు చెప్పి ప్రజలను మోసం చేసే ప్రయత్నిస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదంటూ అబద్ధాలు చెబుతున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ మేనిఫెస్టోలో పెట్టక పోయినప్పటికీ రేషన్ కార్డు ద్వారా కుటుంబంలోని ఒక్కో వ్యక్తికి ఇచ్చే బియ్యాన్ని 4 కేజీల నుంచి ఆరు కిలోలకు పెంచినట్లు తెలిపారు. కుటుంబానికి 20 కిలోలు ఉన్న పరిమితిని ఎత్తివేసి, ఎంతమంది ఉంటే అంత మందికి ఒక్కొక్కరికీ ఆరు కిలోల చొప్పున ఇచ్చినట్లు గుర్తు చేశారు. కేసీఆర్ ప్రభుత్వంలో 6,47,479 నూతన రేషన్ కార్డులు జారీ చేశారని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఇచ్చిన నోటిఫికేషన్లకు ఉద్యోగాలను ప్రజా ధనంతో సభలు పెట్టి తామే ఇచ్చినట్లు అబద్ధాలు పలికి ఇప్పటి వరకు వారికి జాయినింగ్ ఆర్డర్లు కూడా ఇవ్వలేదని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చేయలేదని, మోసపోయిన ప్రజల తరుపున బీఆర్ఎస్ పోరాడితే 8 నెలలకు కొందరికి మాత్రమే రుణ మాఫీ చేశారని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో లాక్‌డౌన్, నోట్ల మార్పిడి వంటి సంక్షోభ పరిస్థితులను ఎదుర్కొని 28,275 కోట్ల రుణమాఫీ చేశారని గుర్తుకు చేశారు. రైతు భరోసాకు రూ.15 వేలు, రైతు కూలీలకు రూ.12 వేలు అని ఇప్పుడు రైతు భరోసా రూ.12 వేలు అంటూ ఒకసారి, సంక్రాంతికి అని మరోసారి, జనవరి 26 కు ఇస్తామని ఓసారి, ఇప్పుడు మళ్లీ మార్చి 31వ తేదీకి అని అంటున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 420 రోజుల్లో రోజుకో రైతు చొప్పున 412 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, దాదాపు 100 మందికి పైగా ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకున్నారని, గురుకులాల్లో నిర్లక్ష్యంతో కల్తీ ఆహారం తినడం వల్ల 55 మందికి పైగా విద్యార్థులు దుర్మరణం పాలయ్యారని, 30 మందికి పైగా చేనేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఆడబిడ్డలకు బతుకమ్మ చీరలు అందిస్తూ, చేనేతలకు ఉపాధి కల్పించి, వారికీ ఆర్థిక సహాయం అందించేవారని, ఇప్పుడు ఆడపడుచులకు బతుకమ్మ చీరలు లేవని, చేనేతలకు ఉపాధి కూడా లేదని అన్నారు. గ్రామ సభల్లో హామీలపై ప్రశ్నించిన రైతులను పోలీసులతో, కాంగ్రెస్ గుండాలతో కొట్టిస్తున్నారని, పైగా బీఆర్ఎస్ పార్టీపై నిందలు వేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గాదె సత్యం, మాజీ కౌన్సిలర్లు అంకం నరేశ్, తోట తిరుపతి, చంద్రశేఖర్ హాండే, ఎడ్ల శంకర్, పడాల శ్రీనివాస్, నాయకులు ఎర్రం తిరుపతి, వోడ్నాల రవీందర్, సాగి వెంకటేశ్వర రావు, జూపాక సుదీర్, గట్టయ్య, గొర్ల సంతోష్, కర్రు శంకర్, బల్లికొండ రమేష్, గుమ్మడి శ్రీనివాస్, అడ్లకొండ రవి గౌడ్, కటం రాజు, ప్రవీణ్, సోహెల్ , హాజీపూర్ మండల పార్టీ అధ్యక్షులు మొగిలి శ్రీనివాస్, మాజీ వైస్ ఎంపీపీ మందపల్లి శ్రీనివాస్, నంనూర్ మాజీ సర్పంచ్ బేర పోచయ్య, తదితరులున్నారు.

**దండేపల్లిలో..**

దండేపల్లి, జనవరి 30 : ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు పరచడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నాయకులు దండేపల్లిలోని గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చుంచు శ్రీనివాస్, సహకార సంఘం వైస్ చైర్మన్ అక్కల రవి, మాజీ వైస్ ఎంపీపీ పసర్తి అనిల్, మాజీ ఉప సర్పంచ్ గోట్ల భూమన్న యాదవ్,నాయకులు గోళ్ల రాయమల్లు, కొట్టే సత్తయ్య, అఖిల్, సుధాకర్, సీపతి మల్లయ్య, అల్వాల సత్తయ్య పాల్గొన్నారు.

**లక్షెట్టిపేటలో..**

లక్షెట్టిపేట, జనవరి30 : గాంధీజీ వర్ధంతిని పురస్కరించుకొని లక్షెట్టిపేటలోని గాంధీ చౌక్ లో గాంధీ విగ్రహానికి మాజీ మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పోడేటి శ్రీనివాస్ గౌడ్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు పాదం శ్రీనివాస్,నాయకులు రాజన్న, షేక్ చాంద్, జిన్ని వెంకటేశ్, అన్వర్, తిరుపతి, సత్తన్న, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**420 హామీల్లో ఒక్కటి అమలు చేయలేదు**

**-బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య**

బెల్లంపల్లి, జనవరి 30 : గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీల్లో 420 రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య విమర్శించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు బీఆర్ఎస్వీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బడికల శ్రావణ్ ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. పాత జీఎం కార్యాలయం మూలమలుపు వద్ద ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి 420 హామీలు అమలు చేయాలని కోరుతూ బీఆర్ఎస్, బీఆర్ఎస్వీ శ్రేణులు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ 2023 ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి కూడా నెరవేర్చకపోవడంతో ప్రజలపై కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి లేకపోవడానికి నిదర్శనమని ఆరోపించారు. 420 రోజులుగా కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలను మోసం చేయడమే కాకుండా, ప్రశ్నించే ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు అక్రమ అరెస్టులు, నిర్బంధాలు కొనసాగిస్తూ రాష్ట్రాన్ని 20 ఏండ్లు వెనక్కి తీసుకెళ్లిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, లేదంటే ప్రజాగ్రహానికి గురికాకతప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీవైస్ చైర్మన్ తొంగల సత్యనారాయణ, మాజీ సర్పంచ్ వేముల కృష్ణమూర్తి, నాయకులు సుభాష్‌రావు, గణేశ్, అరుణ్, శ్రీకాంత్, అలీ, సుందర్‌రావు, శివ, మల్లేశ్, రాజేశం, సుదర్శన్, చంద్రశేఖర్, సతీశ్ పాల్గొన్నారు.

**హామీల అమలులో రేవంత్ సర్కార్ విఫలం**

చెన్నూర్ టౌన్, జనవరి 30 : కాంగ్రెస్ ప్రభుత్వం 420 అబద్ధపు హామీలు ఇచ్చి గద్దెనెక్కి అమలు చేయడంలో విఫలమైందని చెన్నూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు డా.రాజారమేశ్ దుయ్యబట్టారు. రేవంత్ సర్కార్ 420 హామీలు ఇచ్చి



లక్షెట్టిపేట : గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

420 రోజులు గడిచినా నెరవేర్చలేదని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి గురువారం నిరసన వ్యక్తం చేశారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంగ్ కేటీఆర్ పిలుపుమేరకు, పార్టీ జిల్లా అధ్యక్షుడు, చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆదేశానుసారం చెన్నూర్ పట్టణంలోని గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. తెలంగాణలో ఎన్నికల సమయంలో రాహుల్ గాంధీ, ప్రియాంకాగాంధీలు వచ్చి ప్రజలకు ఇచ్చిన హామీలను ఎప్పుడు నెరవేరుస్తారో తెలపాలని బీఆర్ఎస్ నియోజకవర్గ ప్రజల తరుపున ఆయన ప్రశ్నించారు. హిట్లర్‌ను మరిపించే పాలన తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్నదని వివరించారు. హామీల అమలు గురించి అడిగినవారిని పోలీసులతో కొట్టించి, బెదిరించి జైలుపాలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నవాజొద్దీన్, మాజీ కౌన్సిలర్ జోడు శంకర్, మాజీ ఎంపీపీ మంత్రి బాపు, బీఆర్ఎస్ నాయకులు రాంలాల్ గిల్డా, నాయిని సతీశ్, అరీఫొద్దీన్, షఫీ, ఆశిష్, సాంబాగౌడ్, మహేందర్, వెంకటరాజం, ఆసంపల్లి సంపత్, విజయ, చిరంజీవి, రాళ్లబండి స్వామి, అన్వర్, నాయకులు, కార్యకర్తలు, తదితరులున్నారు.

**420 హామీలపై గాంధీ విగ్రహానికి వినతి**

రామకృష్ణాపూర్, జనవరి 30: తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ 420 హామీలు ఇచ్చి గెద్దెనెక్కి 420 గడిచినా ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని చెన్నూరు నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు డా.రాజారమేశ్‌బాబు, క్యాతనపల్లి మున్సిపాలిటీ పట్టణ అధ్యక్షుడు కంభగోని సుదర్శన్‌గౌడ్ ఆధ్వర్యంలో గురువారం రామకృష్ణాపూర్‌లోని ఠాగూర్ స్టేడియం వద్ద గల గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో క్యాతనపల్లి మున్సిపాలిటీ పట్టణ అధ్యక్షుడు కంభగోని సుదర్శన్‌గౌడ్, సీనియర్ నాయకులు రామిడి కుమార్, టీబీజీకేఎస్ నాయకుడు బడికెల సంపత్‌కుమార్, మాజీ కౌన్సిలర్లు పోగుల మల్లయ్య, రేవెల్లి ఓదెలు, బీ.అనిల్‌రావు, నాయకులు గడ్డం రాజు, అలుగుల సత్తయ్య, మూర్తి, ఆర్నే సతీశ్, యువ నాయకులు లక్ష్మీకాంత్, చంద్రకిరణ్, మణి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

**హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం.**

మందమర్రి, జనవరి 30: ఎన్నికల హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జే.రవీందర్, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్‌లు ఆరోపించారు. గురువారం బీఆర్ఎస్ నాయకులు స్థానిక అంగడిబజార్ ఏరియాలో గాంధీ విగ్రహానికి ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్, టీబీజీజీకేఎస్ నాయకులు ఓ.రాజశేఖర్, కొంగల తిరుపతి రెడ్డి, బోరిగం వెంకటేశ్, ఎండీ అబ్బాస్, భట్టు రాజ్‌కుమార్, తోట సురేందర్, ముస్తఫా, పల్లె నర్సింగ్, రాజనర్సు, మొగురం శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్, దుర్గయ్య, బర్ల సదానందం, భూపెల్లి కనకయ్య పాల్గొన్నారు.

**మోసకారి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పాలి**

జన్నారం, జనవరి 30 : మోసకారి కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో 420 హామీలు ఇచ్చి 420రోజుల గడిచినప్పటికీ అమలు చేయకుండా మోసం చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధిచెప్పాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుర్రం రాజారాంరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పొనకల్ గాంధీనగర్‌లోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ సుతారి వినయ్, ప్రధాన కార్యదర్శి సులువ జనార్ధన్, జాడి గంగాదర్, జూనుగూరి మల్లేశ్, కమ్మల విజయదర్మ, నరేశ్‌గౌడ్, కేప నర్సింహులు, కడర్ల నర్సయ్య, ఆనందం, అడెపు లక్ష్మీనారాయణ, దుమల్ల ఎల్లయ్య, జంగ రవి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం**



రామకృష్ణాపూర్ : గాంధీజీ విగ్రహానికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

కాగజ్‌నగర్, జనవరి 30: రాష్ట్ర ప్రజలకు అబద్ధపు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను మోసం చేస్తుందని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గం కన్వీనర్ లెండుగురే శ్యాంరావు ఆరోపించారు. కాగజ్‌నగర్‌లోని గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మస్తాఫిజ్, తదితరులు పాల్గొన్నారు.

**మహాత్మా.. కాంగ్రెస్ ప్రభుత్వం కళ్లు తెరిపించు..**

కెరమెరి, జనవరి 30: 'ఓ మహాత్మా.. ఈ అసమర్థ ప్రభుత్వం కళ్లు తెరిపించు.. దద్దమ్మ కాంగ్రెస్‌కు దారి చూపించు..' అంటూ జాతిపిత మహ్మత గాంధీ విగ్రహానికి బీఆర్ఎస్ నాయకులు వినతిపత్రం సమర్పించి నిరసన తెలిపారు. గాంధీ వర్ధంతి సందర్భంగా మాజీ ఎంపీపీ పెందోర్ మోతీరాం, మాజీ జడ్పీటీసీ సెడ్మకి దుర్పతాబాయితో పాటు బీఆర్ఎస్ నాయకులు మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తొడసం జగన్నాథ్‌రావ్, షేక్ యూనుస్, రాథోడ్ రూప్‌లాల్ నాయక్, మడవి రఘునాథ్, రాథోడ్ రమేశ్, వెంకటేశ్వర్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

**సాధ్యంకాని హామీలిచ్చిన కాంగ్రెస్..**

సిర్పూర్(యూ),జనవరి 30: సాధ్యంకాని హామీలిచ్చి తెలంగాణ ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని జైనూర్ మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు ఆత్రం భగవంత్‌రావ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తొడసం ధర్మరావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి వినతి పత్రం అందజేశారు. ఇప్పటికైనా ఇచ్చిన హామీలను నెరవేర్చాలని లేదంటే ప్రజల పక్షాన పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కుమ్ర భీంరావు, అర్క నాగోరావు, పెందోర్ అర్జు, కోవ నాందేవ్, రాజేశ్వర్, భుజంగ్‌రావు, అంబరావు , ఘన్‌శ్యాం తదితరులున్నారు.

**కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలి**

రెబ్బెన, జనవరి 30: కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన 6 గ్యారెంటీ పథకాలు, 420 హామీలు అమలు చేయాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పోటు శ్రీధర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కార్నాథం సంజీవ్‌కుమార్, వైస్ చైర్మన్ రంగు మహేశ్‌గౌడ్, బీఆర్ఎస్ జిల్లా మహిళ ప్రధాన కార్యదర్శి కుందారపు శంకరమ్మ డిమాండ్ చేశారు. రెబ్బెనలో మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి అనంతరం వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొమ్మినేని అహల్యాదేవి, మాజీ ఎంపీటీసీ సంగం శ్రీనివాస్, మాజీ కో ఆప్షన్‌మెంబర్ జౌరొద్దీన్, మహిళ మండలాధ్యక్షురాలు అన్నపూర్ణ అరుణ, పట్టణ అధ్యక్షుడు రాపర్తి అశోక్, మాజీ ఉపసర్పంచ్ బొమ్మినేని శ్రీధర్, మాజీ డైరెక్టర్ పల్లె రాజేశ్వర్‌రావు, బీఆర్ఎస్ నాయకులు జుమ్మిడి అనందరావు, దుర్గరావు, ఉబెదుల్లా, తక్కలపల్లి రాజేశ్వర్‌రావు, శ్రీకాంత్, రాజేశ్, ప్రభాకర్, పోతిరెడ్డి, దుర్గం తిరుపతి, భుజంగరావు, శంకర్ లతో పాటు పలువురు ఉన్నారు.



దండేపల్లి : వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

**హామీలన్నీ నీటి మూటలు..**

తిర్యాణి, జనవరి 30 : ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నీటి మూటలుగా మారాయని పీఏసీఎస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ముత్యం రాజయ్య ఆరోపించారు. మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని కుమ్రంభీం చౌరస్తాలో గురువారం గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 420 రోజులు గడిచినా ఏఒక్క హామీ నెరవేర్చకపోవడంపై ఆయన చిత్ర పటానికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ ఆత్రం చంద్రశేఖర్, బీఆర్ఎస్ నాయకులు బుర్ర రమేశ్ గౌడ్, దుస్స మధూకర్, పులి చందు, బొడ్డు రవీందర్, తదితరులున్నారు.

**గాంధీ చిత్రపటానికి వినతిపత్రం**

లింగాపూర్, జనవరి 30: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని కోరుతూ మండల బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో గురువారం మహాత్మాగాంధీ చిత్రపటానికి వినతిపత్రం అందజేశారు. అనంతరం మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను నెరవేర్చకుండా మభ్యపెట్టడం సరికాదన్నారు. రానున్న ఎన్నికల్లో గోర ఓటమిని చవి చూడనుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దస్రు,నాయకులు ఆడే కిషన్, జాదవ్ బాపురావు, బాబులాల్, అశీరాం, నాందేవ్, యూత్ సభ్యులు ఆయా గ్రామాల్లోని కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జంగో లింగో దీక్ష భూమిలో అన్నదానం

జైనూర్, జనవరి 30: మండలంలోని జంగాం దీక్ష భూమిలో జంగోలింగో దీక్ష ముగింపు కార్యక్రమంలో గురువారం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత వ్యసనాలకు దూరంగా ఉండి భక్తిమార్గంలో నడవాలన్నారు. అంతకుముందు జంగోలింగో మందిరంలో పూజలు చేశారు. అనంతరం మండల కేంద్రంలో ప్రతిమ హాస్పిటల్ కరీంనగర్ వారి సౌజన్యంతో నిర్వహించిన మెగా వైద్య శిబిరంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే వెంట ఎంపీటీసీల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు కుమ్ర భగ్వంత్‌రావ్, బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు ఆత్రం శంకర్ కోలాం, మాజీ సర్పంచులు గేడం లక్ష్మణ్, కుమ్ర శ్యాంరావ్, జంగోలింగో దీక్ష గురు కుమ్ర భగ్వంత్‌రావ్, పీఏసీఎస్ చైర్మన్ కొడప హన్నుపటేల్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కనక యాధోరావ్, సర్పంచుల సంఘం మండల మాజీ అధ్యక్షుడు మడవి భీంరావ్, డా.అశోక్ , మండల సీనియర్ నాయకులు మెస్రం అంబాజీరావ్, తదితరులు పాల్గొన్నారు.

## జాతర ఏర్పాట్లు పరిశీలించిన ఏఎస్పీ

రెబ్బెన, జనవరి 30: గంగాపూర్ శ్రీ బాలాజీ వెంకటేశ్వరస్వామి జాతర ఫిబ్రవరి 11,12,13 తేదీల్లో జరగనున్న జాతరకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఏఎస్పీ చిత్తరంజన్ సంబంధిత అధికారులకు సూచించారు. గంగాపూర్ జాతర వెళ్లే రోడ్లను గురువారం ఆయన పరిశీలించారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రెబ్బెన పోలీసులకు సూచించారు. భక్తులకు వసతులు కల్పించాలని ఆలయ కమిటీకి సూచించారు. ఈ కార్యక్రమంలో రెబ్బెన సీఐ బుద్ధే స్వామి, ఎస్ఐ చంద్రశేఖర్, ఆర్టీఏ మెంబర్ లావుడ్య రమేశ్, ఆలయ కమిటీ చైర్మన్ లెండుగురే జయరాం, మొర్లె తులసీరాం, సంతోష్ పలువురు ఉన్నారు.

## అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు పూర్తి చేయాలి

ఆసిఫాబాద్ టౌన్, జనవరి 30: ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన పనులను వేగవంతం చేసి ఫిబ్రవరి 10వ తేదీలోగా పూర్తి చేయాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ ధోత్రే ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీతో కలిసి అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ పథకంలో జిల్లాలోని అన్ని యాజమాన్యాలు, జిల్లా పరిషత్, మండల పరిషత్, గిరిజన సంక్షేమ పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన గదుల నిర్మాణం, మౌలిక వసతుల కల్పన, మరమ్మతులపై విద్యాధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించారు. అనంతరం ప్రతి మండల కేంద్రంలో మార్కెట్ ప్రాంతాలు, బస్సు స్టాంపులు, జన సమూహం అధికంగా ఉండే ప్రాంతాలలో అనువైన స్థలాలను ఎంపిక చేసి కమ్యూనిటీ శానిటేషన్ కాంప్లెక్స్‌ల నిర్మాణాలను వెంటనే చేపట్టాలని తెలిపారు. మిషన్ భగీరథ పథకం కింద తాగునీటి సరఫరాలో ఇబ్బంది లేకుండాచూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, డీపీవో భిక్షపతి గౌడ్, పంచాయతీ ఇంజినీరింగ్ ఈఈ. ప్రభాకర్, విద్యా శాఖ అధికారులు, మిషన్ భగీరథ అధికారులు, మండల విద్యాధికారులు, హెచ్ఎంలు, ఎంపీడీవోలు, ఇంజినీరింగ్ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులున్నారు.

## అక్రమ నిర్మాణం కూల్చివేత

కాగజ్‌నగర్, జనవరి 30: కాగజ్‌నగర్‌లోని త్రిశూల్ పహాడ్ దారిలోని మసీదు ఎదురుగా అక్రమంగా నిర్మించిన ఫౌండేషన్, రోడ్డు ఆక్రమించి నిర్మించిన షెడ్డును గురువారం డీటీఎఫ్ సభ్యులు జేసీబీ సహాయంతో కూల్చివేశారు. కొన్నేళ్ల క్రితం సర్వే నంబరు 143లో నైట్ షెల్టర్ కోసం కేటాయించిన స్థలాన్ని కొందరు ఆక్రమించుకోవడంతో కూల్చివేసినట్లు అధికారులు తెలిపారు. డీటీఎఫ్ టీం కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా, మున్సిపల్ కమిషనర్ అంజయ్య, పట్టణ సీఐ రాజేంద్రప్రసాద్, టీపీవో యశ్వంత్ ఆధ్వర్యంలో అక్రమ నిర్మాణం కూల్చివేశారు.

## పద్మశ్రీ కనక రాజుకు ఘన నివాళి

జైనూర్, జనవరి 30: ప్రపంచానికే ఆదివాసీ గుస్సాడీ నృత్యాన్ని పరిచయం చేసిన కీ.శే. పద్మశ్రీ గుస్సాడీ కనక రాజుకి గురువారం పంచాయతీరాజ్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క నివాళులర్పించారు. మండలంలోని మార్లవాయిలో సాయంత్రం కీ.శే.పద్మశ్రీ కనక రాజు సంతాప సభ ఏర్పాటు చేయగా మంత్రితో పాటు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఎమ్మెల్సీ దండె విఠల్, జీసీసీ కార్పొరేషన్ చైర్మన్ తిరుపతి ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొని కనక రాజు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ప్రొఫెసర్ హైమన్ డార్ఫ్ బెట్టి ఎలిజబేత్ విగ్రహాల వద్ద నివాళులర్పించారు. అనంతరం బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో ఏర్పాటు చేసిన మ్యూజియాన్ని సందర్శించారు. సభలో గిరిజనులు పలు సమస్యలతో కూడిన వినతిపత్రాలను మంత్రికి అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ,జైనూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్, మార్లవాయి మాజీ సర్పంచ్ కనక ప్రతిభ వెంకటేశ్, నాయకులు అబ్దుల్ ముకిద్, ఆత్రం జాలింషావ్, మెస్రం అంబాజీరావ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అటవీ సంపదపై అవగాహన ఉండాలి

కాగజ్‌నగర్, జనవరి 30: విద్యార్థి దశ నుంచి అటవీ సంపదపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్‌కుమార్ అన్నారు. కాగజ్‌నగర్ మండలంలోని వేంపల్లి అటవీ క్షేత్రంలో వనదర్శిని కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అడవులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి రేంజ్ అధికారి శశిధర్ బాబు, బీట్ ఆధికారి విజయ్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## టోల్ ఫ్రీ '1912'ను వినియోగించుకోండి

మంచిర్యాలటౌన్, జనవరి 30: విద్యుత్ వినియోగదారులకు మరింత మెరుగైన, నాణ్యమైన సేవలు అందించడంలో భాగంగా ఎటువంటి విద్యుత్ సమస్య తలెత్తినా 1912 టోల్ ఫ్రీనంబర్‌కు సంప్రదించాలని మంచిర్యాల జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ వీ గంగాధర్ తెలిపారు. గురువారం సాయంత్రం ఆయన ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. 1912 నంబర్ 24/7 వినియోగదారులకు అందుబాటులో ఉంటుందని అన్నారు. విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు, ట్రాన్స్‌ఫార్మర్ల ఫేయిల్యూర్లు, ఫ్యూజ్ ఆఫ్ కాల్స్ , లోవోల్టేజీ, బ్రేక్ డౌన్స్, , ప్రమాద భరితంగా ఉన్న స్థంభాలు, వైర్లు తదితర సమస్యలపై ఫిర్యాదులు చేయవచ్చని పేర్కొన్నారు. విద్యుత్ బిల్లుల సమస్యలు, పేరు మార్పు , బిల్లుల్లో తేడాలు, బిల్లులో ఏమైనా హెచ్చుతగ్గులున్నా, విద్యుత్ మీటర్లలోఆగిపోయిన మీటర్లు, నూతన సర్వీసు మంజూరు, సర్వీస్ క్యాన్సలేషన్ మొదలగు అన్ని రకాల విద్యుత్ సమస్యలపై టోల్ ఫ్రీ నంబర్ 1912 సంప్రదించి సేవలు పొందాలని ఆయన కోరారు

## నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు

బెల్లంపల్లి, జనవరి 30 :రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని జిల్లా విద్యుత్ పర్యవేక్షణాధికారి గంగాధర్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం బెల్లంపల్లి విద్యుత్ డివిజన్ అధికారి కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. వేసవిలో విద్యుత్ అంతరాయం లేకుండా వినియోగదారులకు అందించాలని సూచించారు. బెల్లంపల్లి పరిధిలోని సింగరేణి సంస్థకు విద్యుత్ సరఫరా, విద్యుత్ బిల్లుల బకాయిలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో డీఈటీ కైసర్, ఎస్ఏవో రాజేశం, డివిజన్ ఇంజినీర్ రాజన్న, ఏడీఈలు, ఏఈలు పాల్గొన్నారు.